E69 NEWS

తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387

PUBLISHED: HYDERABAD,JANGAON | సంపుటి :01 | సంచిక :156 | ఆదివారం 08 నవంబర్ 2026 | ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ | పేజీలు: 04 | వెల :05/-

అరచేతిలో ఆర్టీసీ.. అదిరిపోయే అప్‌డేట్!



ఒకే క్యూఆర్‌తో ఆర్టీసీ సేవలు

స్కాన్ చేస్తే లైవ్ బస్సు ట్రాకింగ్

ఆన్‌లైన్‌లో టికెట్ రిజర్వేషన్

బస్సుల వేళలు, రూట్ల వివరాలు

సోషల్ మీడియా లింకులన్నీ ఒకేచోట

ఫిర్యాదులు, సూచనలకు ప్రత్యేక సదుపాయం

ఈ20 కాదు.. 420 పెట్రోల్ -రాహుల్ ఫైర్!

ఈ20 పెట్రోల్‌లో అధిక ఇథనాల్ కల్తీ?

14 నమూనాల్లో 11 చోట్ల అధిక శాతం

31.2 శాతం ఇథనాల్ ఉన్నట్లు గుర్తింపు

మోదీ సర్కారుపై రాహుల్ తీవ్ర విమర్శలు

చమురు సంస్థలపై చర్యలు ఎప్పుడంటూ ప్రశ్న

ఆరోపణలను ఖండించిన చమురు సంస్థలు

పెట్రోల్ నాణ్యతపై ప్రమాణాలే ఆధారమన్న సంస్థలు

పరీక్షల తీరుపై చమురు సంస్థల అభ్యంతరం



న్యూస్ డెస్క్, 07 నవంబర్ (తెలుగు గళం): దేశంలో పెట్రోల్ నాణ్యత, ఇథనాల్ బ్లెండింగ్ ప్రక్రియపై రాజకీయ వివాదం మొదలైంది. పెట్రోల్‌లో నిర్ణీత పరిమితికి మించి ఇథనాల్ కలుపుతున్నారంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కర్ణాటకలోని ఏడు జిల్లాల నుంచి సేకరించిన పెట్రోల్ నమూనాలను పరీక్షించగా.. 14 నమూనాల్లో 11 చోట్ల 20 శాతానికి మించి ఇథనాల్ ఉన్నట్లు తేలిందని వెల్లడించారు. ఈ మేరకు శనివారం సోషల్ మీడియా వేదికగా పోస్టు చేస్తూ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నది ఈ20 పెట్రోల్ విధానం కాదని 420 విధానం అంటూ సెటైర్ వేశారు.

మోడీజీ ఎప్పుడు చర్యలు తీసుకుంటారు?

ప్రజల కార్లలోని పెట్రోల్‌ను దోచుకుంటున్నారంటూ కేంద్రంపై ఫైర్ అయ్యారు. 2 లో

రాహుల్ గాంధీని

తెలంగాణలో అడుగు పెట్టనివ్వం

రాహుల్ పర్యటనను అడ్డుకుంటాం

హామీలు నెరవేర్చకుండా తెలంగాణకు రావొద్దు

యువతను, నిరుద్యోగులను మోసం చేశారు

రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదు

పెట్టుబడులకు బీజేపీ వ్యతిరేకం కాదు

వైఫల్యాలను కేంద్రంపై నెట్టడం సరికాదు

దీపావళి తర్వాత బీజేపీ పాదయాత్రలు

యాత్రల్లో పాల్గొననున్న జాతీయ నేతలు 2 లో



సోనియా జీవితంలోని తెలియని కోణాలు!

నవంబర్ 10న సోనియా ఆత్మకథ విడుదల

భారతీయ సంస్కృతికి ఎలా దగ్గరయ్యారంటే..

రాజీవ్‌తో తొలి తందూరీ చికెన్ అనుభవం

చీరకట్టుపై ఆసక్తికర విషయాలు

నెహ్రూ నేసిన చీరతో వివాహం

ఇందిరాతో పరిచయం.. హిందీ నేర్చుకున్న వైనం

కుటుంబాన్ని కలచివేసిన వరుస విషాదాలు

ప్రధాని పదవిని తిరస్కరించిన సందర్భం 2 లో

రాజకీయాల్లోకి ధనుష్.. క్లారిటీ ఇచ్చేశాడు!

తన వెనుక ఏ పార్టీ లేదన్న నటుడు

బీజేపీ మద్దతు ప్రచారానికి చెక్

దేవుడే తనను నడిపిస్తున్నాడని వ్యాఖ్య

అభిమానులే తనకు అసలైన బలమని వెల్లడి

తమిళనాట రాజకీయ ప్రవేశంపై చర్చ 2 లో

3 వేల మంది న్యాయ సలహాదారుల నియామకానికి ప్లాన్



దీపావళి పర్వదిన సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు కావున రేపటి సంచిక (సోమవారం 09-11-2026) వెలువడదు

పున: దర్శనం తిరిగి మంగళవారం (10-11-2026)

-ఎడిటర్



చీరల పంపిణీకి రంగం సిద్ధం!

- ఈ నెల 19 నుంచి చీరల పంపిణీ
- 95 లక్షల మంది మహిళలకు లబ్ధి
- రూ.334 కోట్లతో పథకం అమలు
- నెక్లెస్ రోడ్డులో సీఎం ప్రారంభం
- చిలకపచ్చ రంగులో కొత్త చీరలు
- సిరిసిల్ల సహా 14 కేంద్రాల్లో తయారీ
- ఇప్పటికే 65 లక్షల చీరలు సిద్ధం
- ఆధార్‌తో లబ్ధిదారుల గుర్తింపు
- వారం రోజుల పాటు పంపిణీ కార్యక్రమం

న్యూస్ డెస్క్, 07 నవంబర్ (తెలుగు గళం): తెలంగాణలో మహిళలకు తీపి కబురు. ప్రభుత్వం అందించనున్న ఉచిత చీరల పంపిణీకి ముహూర్తం ఖరారైంది. ఇందిరా మహిళాశక్తి పథకం కింద ఈ నెల 19న హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులతో పాటు రాజధాని పరిసర ప్రాంతాల్లోని మహిళా సంఘాల సభ్యురాళ్లు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. 2026 సంవత్సరానికి ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం రూ.334 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 95 లక్షల మంది మహిళలకు చీరలు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. మిగతాది 2 లో..

పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ!

సొంత ఆదాయం నేరుగా ఖాతాల్లోకి

ఖజానా చుట్టూ తిరిగే పని లేదు


నిధుల విడుదలలో జాప్యానికి చెక్

అభివృద్ధి పనులకు తక్షణ నిధులు

సర్పంచ్‌లకు పెరగనున్న ఆర్థిక స్వేచ్ఛ

గ్రామీణ మౌలిక వసతులకు ఊతం


స్థానిక పాలనలో పారదర్శకతకు పెద్దపీట



2 లో

న్యూస్ డెస్క్, 07 నవంబర్ (తెలుగు గళం): గ్రామ స్థాయి అభివృద్ధికి పెద్దపీట వేస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ పంచాయతీలు తమ సొంత వనరుల ద్వారా సమకూర్చుకున్న ఆదాయాన్ని ఇకపై ప్రభుత్వ ఖజానా ద్వారా మళ్లించాల్సిన అవసరం లేకుండా, నేరుగా ఆయా పంచాయతీల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసుకునేందుకు వీలుగా చట్ట సవరణ చేసింది. ఈ మేరకు పంచాయతీ రాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖ, తెలంగాణ పంచాయతీ రాజ్ (నాల్గవ సవరణ) చట్టం, 2026ను అక్టోబర్ 9, 2026 నుండి అమలులోకి తెస్తూ జీవో ఎంఎస్ నెం. 43ను జారీ చేసింది.

ఇక ఇంటింటికీ ఇంటర్నెట్!



భారత్ నెట్‌తో ప్రాజెక్టుకు మార్గం

తెలంగాణకు రూ.3,185 కోట్ల నిధులు

కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందం

కొత్తగా రూరల్ ఇంటర్నెట్ కార్పొరేషన్

టీ-ఫైబర్‌తో ఇంటింటికీ కనెక్టివిటీ 2 లో

కొడంగల్ టెండర్లలో 5 వేల కోట్ల గోల్‌మాల్?

మంత్రి కంపెనీకే పనులంటూ ఆరోపణలు

మిగతా సంస్థలన్నీ డమ్మీలేనన్న కేటీఆర్

1,450 కోట్ల నుంచి 6,825 కోట్లకు పెంపు

ఐదు రెట్లు పెరిగిన ప్రాజెక్టు అంచనా వ్యయం

ప్రజాధనం దోచుకుంటున్నారంటూ విమర్శ

రాహుల్ గాంధీకి కేటీఆర్ చురకలు


2 లో

న్యూస్ డెస్క్, 07 నవంబర్ (తెలుగు గళం): తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. కొడంగల్–నారాయణపేట–మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్ల కేటాయింపు ప్రక్రియలో భారీ ఎత్తున నిధుల దుర్వినియోగం, అంతా ఏకపక్షం జరుగుతోందని ఆరోపించారు. ఈ మేరకు శనివారం కేటీఆర్ సామాజిక మాధ్యమం ట్విట్టర్ వేదికగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

మంత్రి సంస్థకే పనులు:

కొడంగల్–నారాయణపేట–మక్తల్ లిఫ్ట్ ఇరిగేషన్ టెండర్లలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన కంపెనీయే దరఖాస్తు చేసుకుందని,

రాహుల్ గాంధీని తెలంగాణలో అడుగు పెట్టనివ్వం



న్యూస్ డెస్క్, 07 నవంబర్ (తెలుగు గళం): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర యువతను, రైతులను కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రంగా మోసం చేశారని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మండిపడ్డారు. ఎన్నికల హామీలను నెరవేర్చకుండా రాహుల్ గాంధీ తెలంగాణకు వస్తే ఆయనను తప్పకుండా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో యువతకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసిన రాహుల్ గాంధీకి తెలంగాణలో అడుగుపెట్టే హక్కు లేదని, ఆయన పర్యటనలను అడ్డుకొని తీరతామని హెచ్చరించారు. తాము 'భారత్ సమ్మిట్' నిర్వహణకు వ్యతిరేకం కాదని వెల్లడించారు. తెలంగాణకు కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు వస్తే ఎప్పుడైనా స్వాగతిస్తామని స్పష్టం చేశారు.

రైతుల సమస్యల విస్మరణ..

రాష్ట్రంలో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న రైతులను ఆదుకోవాల్సిన బాధ్యతను పక్కనపెట్టి, కాంగ్రెస్ నేతలు ఢిల్లీ కార్యక్రమాల్లో పాల్గొనడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. రైతులకు అవసరమైన సాయం అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. 'తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రభుత్వం పదే పదే కేంద్ర ప్రభుత్వంపై నెపం నెట్టడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణవ్యాప్తంగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం దీపావళి తర్వాత విస్తృత పాదయాత్రలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ పాదయాత్రల ముగింపు లేదా ముఖ్య ఘట్టాలకు బీజేపీ జాతీయ నాయకులు హాజరుకానున్నారని తెలిపారు.

రాజకీయాల్లోకి ధనుష్.. క్లారిటీ ఇచ్చేశాడు!



న్యూస్ డెస్క్, 07 నవంబర్ (తెలుగు గళం): తమిళ సినీ నటుడు ధనుష్ రాజకీయ రంగ ప్రవేశంపై చర్చ గత కొంతకాలంగా జోరందుకుంది. 'తమిళగ ఎళుచ్చి కళగం' పేరుతో ధనుష్ కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఆ పేరును ఎన్నికల సంఘం వద్ద కూడా నమోదు చేయించుకున్నారంటూ వార్తలు వచ్చాయి. అయితే ధనుష్ రాజకీయాల్లోకి రావడానికి బీజేపీ మద్దతు ఉందని, ఆయన్ను వెనుకుండి నడిపిస్తున్నది కమలం పార్టీనే అంటూ జరుగుతున్న ప్రచారంపై తాజాగా ఆయన స్పందించారు. తన వెనక ఏ రాజకీయ పార్టీ లేదని స్పష్టం చేశారు. తన తాజా చిత్రం 'ఓం' ఆడియో విడుదల కార్యక్రమంలో పాల్గొన్న ధనుష్ ఈ అంశంపై మాట్లాడుతూ తన గురించి అనేక రకాల ప్రచారాలు జరుగుతున్నాయని, కొందరు తన వెనుక ఉన్నారని, మరికొందరు తనకు మద్దతు ఇస్తున్నారని వార్తలు వస్తున్నాయని పరోక్షంగా ప్రస్తావిస్తూ.. తనకు ఏ వ్యక్తి లేదా సంస్థ ప్రత్యేకంగా మద్దతు ఇవ్వడం లేదని స్పష్టం చేశారు.

నన్ను నడిపిస్తున్నది అతడే:

అయితే తనకు దేవుడి ఆశీస్సులు ఉన్నాయని, అభిమానులు తన వెనుక ఉన్నారని, ప్రజలు తనకు అండగా ఉన్నారని ధనుష్ తెలిపారు. దేవుడే తనను నడిపిస్తున్నాడని, అభిమానులు తనకు బలమని స్పష్టం చేశారు. ప్రజలే తనకు అండగా నిలుస్తున్నారని వ్యాఖ్యానించారు. తన రాజకీయ ప్రయాణంపై వస్తున్న ఊహాగానాలకు తెరదించకపోయినా, తనకు ఏ రాజకీయ పార్టీ ప్రత్యేక మద్దతు లేదనే విషయాన్ని ఆయన స్పష్టం చేయడం ద్రవిడ పాలిటిక్స్ లో ఆసక్తిని రేపుతోంది. కాగా ప్రజలకు ఎదురయ్యే చట్టపరమైన సమస్యలు, సామాజిక సమస్యలకు న్యాయ సలహాలను అందించేందుకు తమిళనాడు వ్యాప్తంగా 3 వేల మంది న్యాయ సలహాదారులను నియమించాలని, ఇందుకు సంబంధించిన వ్యవస్థను జిల్లాల వారీగా ఏర్పాటు చేయాలని ధనుష్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంతో సినీ కెరీర్ లో దుమ్ము దులిపిన ధనుష్ భవిష్యత్ లో రాజకీయ రంగంలోనూ రప్ఫాడించబోతున్నారని ఆయన అభిమాను ధీమా వ్యక్తం చేస్తున్నారు.

కొడంగల్ టెండర్లలో రూ.5 వేల కోట్ల గోల్‌మాల్?


మొదటి పేజీ తరువాయి

పోటీలో ఉన్న మిగిలిన సంస్థలన్నీ కేవలం కాగితాలకే పరిమితమైన "డమ్మీ కంపెనీలు" అని కేటీఆర్ విమర్శించారు. రేసులో ఒక్కరే పరుగెత్తి గెలిచిన చందంగా ఈ టెండర్ల సెటప్ ఉందని ఆరోపించారు. ప్రారంభంలో దాదాపు రూ.1,450 కోట్లుగా ఉన్న ఈ ప్రాజెక్ట్ అంచనా వ్యయాన్ని ఏకంగా ఐదు రెట్లు పెంచి రూ.6,825 కోట్లకు చేర్చారని దుయ్యబట్టారు. వేల కోట్ల రూపాయల ప్రాజెక్ట్ ఖర్చు పెంపుతో ప్రజాధనాన్ని మళ్లిస్తున్నారే తప్ప, ఇప్పటివరకు ఈ పథకం ద్వారా ప్రజలకు చుక్క నీరు కూడా అందించలేకపోయారని మండిపడ్డారు.

రాహుల్ గాంధీ హెల్ప్ చేయండి..

రాష్ట్రంలో సామాన్య ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్ల వద్ద క్యూ లైన్లలో నిలబడే పరిస్థితి ఉంటే, కాంగ్రెస్ నాయకులు మాత్రం ఇరిగేషన్ ప్రాజెక్టుల పేరుతో తెలంగాణ వనరులను నిలువునా దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ పరిణామాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ట్యాగ్ చేస్తూ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. క్రోనీ క్యాపిటలిజం, పగటిపూట దోపిడీ, క్లెప్టోక్రసీ (అనే పదాలు కూడా ఈ దోపిడీ ముందు చాలా చిన్నవి అయిపోతున్నాయని రాహుల్ గాంధీ గారూ.. ఈ దోపిడీని వర్ణించడానికి దయచేసి ఏదైనా కొత్త పదాన్ని వెతకడంలో నాకు సహాయం చేయండి అంటూ ఎద్దేవా చేశారు.

సోనియా జీవితంలోని తెలియని కోణాలు!



న్యూస్ డెస్క్, 07 నవంబర్ (తెలుగు గళం): కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తన జీవిత విశేషాలతో రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' నవంబర్ 10న విడుదల కానుంది. హార్పర్ కొలిన్స్ ప్రచురిస్తున్న ఈ పుస్తకానికి సంబంధించిన కొన్ని ఆసక్తికర అంశాలను పబ్లిషర్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. మొదట్లో తనకు తెలియని ఒక దేశం, సంస్కృతి మెల్లమెల్లగా తన జీవితంలో భాగమయ్యాయని సోనియా అందులో పేర్కొన్నారు.

తన భర్త రాజీవ్ గాంధీతో కలిసి మొదటిసారి భారతీయ వంటకమైన 'తందూరీ చికెన్' రుచి చూసిన జ్ఞాపకాన్ని ఆమె పంచుకున్నారు. అది బాగా ఎర్రగా ఉండి నోరు మండించిందని, ఆ తర్వాత మెల్లగా థాలీలో వడ్డించే అన్నం, పుల్కాలు, కూరలు, అర్హర్ పప్పు, మటన్, చికెన్ వంటకాలకు అలవాటు పడ్డానని తెలిపారు. చీర ప్రపంచంలోనే అత్యంత సుందరమైన దుస్తులలో ఒకటి అని, కానీ మొదట్లో దాన్ని ధరించడం కష్టంగా అనిపించేదని పేర్కొన్నారు. నిశ్చితార్థం వేళ చీర ఊడిపోకుండా ఉండటానికి పలు సేఫ్టీ పిన్నులు వాడాల్సి వచ్చిందని, పెళ్లికి మాత్రం స్వాతంత్ర్య సమరంలో భాగంగా జవహర్‌లాల్ నెహ్రూ జైలులో వడికిన నూలుతో నేసిన చీరను ధరించినట్లు వెల్లడించారు.

కేంబ్రిడ్జ్‌లోని ఒక గ్రీక్ రెస్టారెంట్‌లో రాజీవ్ గాంధీని మొదటిసారి కలిసినప్పుడు ఆయన ఎంతో హుందాగా, శాంత స్వభావుడిగా కనిపించారని సోనియా గుర్తు చేసుకున్నారు. అత్తగారు, మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో పరిచయం, భారతదేశంలో స్థిరపడటానికి తాను చేసిన ప్రయత్నాలు, హిందీ నేర్చుకోవడం వంటి విషయాలను పుస్తకంలో వివరించారు. అలాగే సంజయ్ గాంధీ విమాన ప్రమాద మరణం, 1984లో ఇందిరా గాంధీ హత్య, 1991లో రాజీవ్ గాంధీ దారుణ హత్య వంటి విషాద ఘటనలు తమ కుటుంబాన్ని తీవ్రంగా కలచివేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుదీర్ఘ కాలం పాటు రాజకీయాలకు దూరంగా ఉండాలని భావించినప్పటికీ, పరిస్థితుల ప్రభావంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఎలా రావాల్సి వచ్చిందో ఈ పుస్తకంలో పొందుపరిచారు. కాంగ్రెస్ అధ్యక్షురాలిగా, ఎంపీగా, యూపీఏ అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆమె.. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకత్వంలోని కూటమి విజయం సాధించిన వేళ ప్రధాని పదవిని నిరాకరించి, పదేళ్ల పాటు యూపీఏ కూటమికి మార్గదర్శకత్వం వహించిన రాజకీయ పరిణామాలను సమగ్రంగా వివరించారు.

అరచేతిలో ఆర్టీసీ.. అదిరిపోయే అప్‌డేట్!



న్యూస్ డెస్క్, 07 నవంబర్ (తెలుగు గళం): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులకు మరింత మెరుగైన, ఆధునిక సేవలు అందించేందుకు సరికొత్త డిజిటలైజేషన్‌తో ముందుకు వచ్చింది. 'ప్రగతి రథం – ప్రజా సేవా పథం' ధ్యేయంగా పనిచేస్తున్న ఆర్టీసీ, మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా తన సేవలను ప్రయాణికుల అరచేతిలోకి తీసుకొచ్చింది. స్మార్ట్‌ఫోన్ వాడకం బాగా పెరిగిన నేటి కాలంలో.. ఒకే ఒక్క క్యూఆర్ కోడ్ ద్వారా ఆర్టీసీకి చెందిన అన్ని సేవలను ఒకే చోట పొందే ప్రత్యేక సదుపాయాన్ని రూపొందించింది. ఇంతకుముందు ఉన్న క్యూఆర్ కోడ్ విధానాన్ని సరికొత్త రీతిలో ఆధునీకరించి ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చారు. ఈ క్యూఆర్ కోడ్‌ను మొబైల్ కెమెరాతో స్కాన్ చేయగానే, ఆర్టీసీకి సంబంధించిన వివిధ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, అప్లికేషన్ల లింక్‌లు స్క్రీన్‌పై ప్రత్యక్షమవుతాయి.

ఒకే స్కాన్‌తో లభించే సేవలు ఏంటంటే..?

మొదటిది బస్సుల ప్రత్యక్ష ట్రాకింగ్. యాప్ ద్వారా బస్సులు ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయో లైవ్ లొకేషన్ తెలుసుకోవచ్చు. ఊళ్ల నుంచి లేదా సుదూర ప్రాంతాల నుండి వచ్చే బంధువులు, మిత్రులు ఏ సమయానికి గమ్యస్థానానికి చేరుకుంటారో కచ్చితంగా అంచనా వేయవచ్చు. రెండవది డిజిటల్ టికెట్ రిజర్వేషన్. ఆర్టీసీ అధికారిక బుకింగ్ యాప్ ద్వారా ముందస్తుగా ప్రయాణించాల్సిన బస్సుల్లో టికెట్లను సులభంగా రిజర్వ్ చేసుకోవచ్చు. మూడోది సమగ్ర బస్సుల వివరాలు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూట్లలో నడిచే బస్సుల వేళలు, సర్వీసు రకాలు (ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్‌లగ్జరీ తదితరాలు), రూట్ మ్యాప్‌లను పరిశీలించవచ్చు. నాలుగోది అధికారిక సోషల్ మీడియా కనెక్టివిటీ ఆర్టీసీ ఎప్పటికప్పుడు ప్రకటించే సమాచారం, హెచ్చరికలు తెలుసుకునేందుకు వారి ఎక్స్ (ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్, వాట్సాప్ ఛానళ్లను ఒకే క్లిక్‌తో ఓపెన్ చేయవచ్చు.

అభిప్రాయాలు, ఫిర్యాదులూ అక్కడే..

ఈ వ్యవస్థ ద్వారా సంస్థ పనితీరును మరింత మెరుగుపరచడానికి ప్రయాణికులు తమ సలహాలు, సూచనలను అందించవచ్చు. ప్రయాణంలో ఎదురయ్యే ఇబ్బందులపై ఫిర్యాదులు చేసేందుకు కూడా సోషల్ మీడియా లింక్‌లు ఉపయోగపడతాయి. వినియోగదారులు తమ ఈ-మెయిల్ ఐడీ, పాస్‌వర్డ్‌తో ఒకసారి ఖాతా తెరుచుకుంటే, ఈ సేవలన్నింటినీ నిరంతరం పొందే అవకాశం ఉంటుంది. ఆర్టీసీ ప్రవేశపెట్టిన ఈ క్యూఆర్ కోడ్ విధానం వల్ల క్యూలైన్లలో నిలబడే అవసరం తప్పడమే కాకుండా, ప్రయాణ సమయం ఆదా అవుతోందని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇక ఇంటింటికీ ఇంటర్నెట్!

న్యూస్ డెస్క్, 07 నవంబర్ (తెలుగు గళం): తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఇంటా వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందించే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు మార్గం సుగమమైంది. కేంద్ర ప్రభుత్వపు అమెండెడ్ భారత్ నెట్ ప్రోగ్రామ్ కింద తెలంగాణ రాష్ట్రంలో రూరల్ ఇంటర్నెట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ను బలోపేతం చేసేందుకు కేంద్రంతో ఒప్పందం పూర్తయింది. ఢిల్లీలోని సంచార్ భవన్‌లో జరిగిన తొలి బోర్డు సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఐఏఎస్ అధికారి అనుదీప్ దురిశెట్టి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

రూ. 3,185 కోట్ల కేంద్ర నిధులు..

ఈ ఒప్పందం ద్వారా తెలంగాణ రాష్ట్రానికి రూ. 3,185 కోట్ల భారీ నిధులు సమకూరనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 'తెలంగాణ రాష్ట్ర రూరల్ ఇంటర్నెట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్' ను ఏర్పాటు చేయనున్నారు. టీ-ఫైబర్ ఎండీ పన్నీరు వేణు ప్రసాద్ ఈ కొత్త కార్పొరేషన్‌కు సీఈఓగా వ్యవహరించనున్నారు. టీ-ఫైబర్, కొత్త కార్పొరేషన్ సంయుక్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించనున్నాయి. ఈ సమావేశానికి వర్చువల్ విధానంలో సీనియర్ ఐఏఎస్ అధికారులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, డాక్టర్ గౌరవ్ ఉప్పల్ హాజరయ్యారు. సంచార్ భవన్‌లో జరిగిన నేరుగా జరిగిన కార్యక్రమంలో డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్రా, తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, టీ ఫైబర్ ఎండీ ఢ సీఈఓ పన్నీరు వేణు ప్రసాద్, బీఎస్ఎన్ఎల్ఏ డైరెక్టర్ పాపా సుధాకర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ!

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయి.


నిధుల విడుదలలో జాప్యానికి చెక్

గతంలో గ్రామ పంచాయతీలు వివిధ మార్గాల ద్వారా సమకూర్చుకున్న సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేసి, ఆ తర్వాత నిధులను పొందాల్సి వచ్చేది. ఈ సంక్లిష్టమైన విధానం వల్ల గ్రామాల్లో అత్యవసరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడంలో తీవ్రమైన జాప్యం జరిగేది. ఫలితంగా పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, రహదారుల మరమ్మతులు వంటి ప్రాథమిక అవసరాలను తీర్చడంలో గ్రామ పంచాయతీలు తరచూ ఇబ్బందులను ఎదుర్కొనేవి. స్థానిక సంస్థల ఆర్థిక స్వయంప్రతిపత్తికి ఈ విధానం కొంత అడ్డంకిగా మారడంతో, ప్రభుత్వం ఈ శాసన సవరణను తీసుకువచ్చింది.

వేగవంతం కానున్న స్థానిక అభివృద్ధి పనులు

ఇప్పుడు కొత్త నిబంధనల ప్రకారం నిధులు నేరుగా గ్రామ పంచాయతీల బ్యాంకు ఖాతాల్లోనే జమ అవుతుండటంతో, స్థానిక సర్పంచ్‌లు లేదా పాలకవర్గాలు ఆ ఆదాయాన్ని ఎవరి అనుమతి కోసం ఎదురుచూడకుండా తక్షణమే వినియోగించుకునే అవకాశం ఏర్పడింది. ప్రజల తక్షణ స్థానిక అవసరాలను ఇట్టే తీర్చడానికి ఈ సంస్కరణ ఎంతగానో దోహదపడుతుందని అధికారులు తెలిపారు. నిధుల కొరత లేదా సాంకేతిక జాప్యం లేకుండా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి ప్రాజెక్టులు శరవేగంగా ముందుకు సాగనున్నాయి. ఈ నిర్ణయంతో గ్రామ పంచాయతీలు ఆర్థికంగా మరింత పటిష్టంగా మారడంతో పాటు, పాలనలో పారదర్శకత పెరుగుతుందని భావిస్తున్నారు.

నామినేటెడ్ పోస్టులపై గుడ్‌న్యూస్!



న్యూస్ డెస్క్, 07 నవంబర్ (తెలుగు గళం): రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ వేగంగా జరుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ గౌడ్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కార్పొరేషన్ చైర్మన్ పదవులతో పాటు డైరెక్టర్ పదవులను కూడా త్వరలోనే భర్తీ చేయనున్నట్లు తెలిపారు. చైర్మన్ పదవులతో పాటు డైరెక్టర్ పదవుల భర్తీకి సంబంధించి ప్రస్తుతం తీవ్ర కసరత్తు జరుగుతోందని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీలో ప్రస్తుత పరిస్థితులు, పరిణామాలపై పూర్తి వివరాలను సేకరించి అధిష్టానానికి నివేదిక అందజేసినట్లు ఆయన తెలిపారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు..

ప్రస్తుతం గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ఏఐసీసీ నిఘా – పనితీరు ఆధారంగానే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గతంలో ఉన్నట్లు లేదని, నాయకులు, మంత్రుల పనితీరును పర్యవేక్షించడానికి ఏఐసీసీ స్థాయిలో పెద్ద వ్యవస్థే పని చేస్తోందని తెలిపారు. కనీసం మూడు రోజులు పార్టీ కార్యక్రమాల నివేదిక ఢిల్లీకి వెళ్లకుంటే వెంటనే అక్కడి నుంచి మెసేజ్ వస్తుందని ఆయన పేర్కొన్నారు. రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో గెలుపు కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు మరియు ఇతర నాయకులందరూ సమన్వయంతో కలిసికట్టుగా పనిచేస్తున్నారని మహేష్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

కవిత డిమాండ్‌కు సర్కార్ తలొగ్గిందా?



న్యూస్ డెస్క్, 07 నవంబర్ (తెలుగు గళం): తెలంగాణ రక్షణ సేన డిమాండుకు తలొగ్గే ప్రభుత్వం ఎస్టీలకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి వచ్చిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత 'ఎక్స్'లో పేర్కొన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఎస్సీ, ఎస్టీ కమిషన్లను కలిపి ఒకే కమిషన్‌గా ఏర్పాటు చేయడంతో అటు ఎస్సీలకు, ఇటు ఎస్టీలకు పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని తెలిపారు. ఈ విషయాన్ని పలుమార్లు తాము ప్రశ్నించామని గుర్తుచేశారు. సమాజంలో ఎస్సీలు, ఎస్టీలు ఎదుర్కొంటున్న సామాజిక, భౌగోళిక సమస్యలు పూర్తిగా వేర్వేరుగా ఉన్నాయని పేర్కొన్నారు. నేటికీ ఎస్సీలు సమాజంలో పీడన, అణచివేత, దౌర్జన్యాలను ఎదుర్కొంటుంటే, మరోవైపు ఆదివాసీలను రకరకాల పేర్లతో అడవి నుంచి దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని తెలిపారు. గిరిజనులు తమ అస్తిత్వమైన జల్-జంగల్-జమీన్‌పై హక్కులను కోల్పోయే ప్రమాదకర పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఆదివాసీలు, గిరిజన సమాజం అభ్యున్నతి కోసం ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం వారికి మంచి చేస్తుందని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు కానున్న ఎస్టీ కమిషన్ గిరిజనుల ఆకాంక్షలకు ప్రతీకగా నిలవాలని.. వారి ఆత్మగౌరవాన్ని, విశిష్టమైన సంస్కృతి సంప్రదాయాలను గౌరవించేలా పనిచేయాలని ఆకాంక్షించారు.

ఈ20 కాదు.. 420 పెట్రోల్: రాహుల్ ఫైర్!

మొదటి పేజీ తరువాయి

ఈ పరిణామాలపై ప్రధాని మోడీని ఉద్దేశించి రాహుల్ గాంధీ ప్రశ్నలు సంధించారు. పెట్రోల్‌లో వాస్తవంగా ఎంత శాతం ఇథనాల్ కలుపుతున్నారు? 20 శాతానికి మించి ఇథనాల్ కలిపిన సంస్థలపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారు? ప్రభుత్వ విధానాల వల్ల ఎవరికి ప్రయోజనం కలుగుతోందని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వ ఇథనాల్ మిశ్రమ విధానంపై చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.

31 శాతానికి పైగా ఇథనాల్!

కాగా కర్ణాటకలోని బెంగళూరు, కోలార్, చిక్కబళ్లాపూర్, బెంగళూరు రూరల్, రామనగర, మంగళూరు, తుమకూరు జిల్లాల నుంచి నమూనాలను పరిశీలించగా పెట్రోల్‌లో 26 నుంచి 31 శాతం వరకు ఇథనాల్ తెలిసిందంటూ కర్ణాటక ప్రభుత్వం ప్రకటన చేసింది. ఈ పరీక్షల వివరాలను రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా పోస్టు చేస్తూ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్ నమూనాలో 31.2 శాతం, హిందుస్థాన్ పెట్రోలియం నమూనాలో 30.5 శాతం ఇథనాల్ ఉన్నట్లు గుర్తించారు. భారత్ పెట్రోలియం, నయారా ఎనర్జీ, షెల్ సంస్థలకు చెందిన పెట్రోల్ నమూనాల్లోనూ 20 శాతానికి మించి ఇథనాల్ ఉన్నట్లు ఆరోపించారు. మొదట ఈ నమూనాలను ఐఓసీఎల్, బీపీసీఎల్ సంస్థల సొంత ప్రయోగశాలలకు పంపగా.. వాటి నివేదికల్లో ఇథనాల్ శాతాన్ని వెల్లడించలేదని రాహుల్ విమర్శించారు. దీంతో స్వతంత్ర ప్రయోగశాలల్లో పరీక్షలు చేయించాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

ఆరోపణలను ఖండించిన చమురు సంస్థలు:

కర్ణాటక ప్రభుత్వం వెల్లడించిన పరీక్షా ఫలితాలపై ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ అభ్యంతరం వ్యక్తం చేశాయి. దేశవ్యాప్తంగా, కర్ణాటకలోనూ సరఫరా చేస్తున్న ఈ20 పెట్రోల్ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ నిర్దేశించిన ఐఎస్ 17021 ప్రమాణాలకు అనుగుణంగానే ఉందని సంయుక్త ప్రకటనలో స్పష్టం చేశాయి. 2026 అక్టోబర్‌లో నిర్వహించిన నమూనాల సేకరణ ప్రక్రియపై కూడా సంస్థలు ప్రశ్నలు లేవనెత్తాయి. నమూనాల సేకరణ సమయంలో తమ ప్రతినిధులు పాల్గొనలేదని, పరీక్షల కోసం తీసుకున్న నమూనాల్లో కొంత భాగాన్ని తిరిగి భద్రపరచిన వివరాలు, పెట్రోల్ బంకుల వారీగా పూర్తి వివరాలు, సమగ్ర ల్యాబ్ నివేదికలు తమకు అందలేదని తెలిపాయి. కర్ణాటక ప్రభుత్వం ప్రస్తావించిన థర్డ్ పార్టీ ల్యాబ్ నివేదికల్లో ఇథనాల్ శాతాన్ని నిర్ధారించేందుకు అవసరమైన సాంకేతిక వివరాలు లేవని పేర్కొన్నాయి. సరైన పత్రాలు, నమూనాలు లేకుండా పరీక్షా ఫలితాలను స్వతంత్రంగా ధ్రువీకరించడం సాధ్యం కాదని స్పష్టం చేశాయి.


చీరల పంపిణీకి రంగం సిద్ధం!

మొదటి పేజీ తరువాయి

ఈసారి మహిళలకు అందించే చీరల రంగులోనూ ప్రభుత్వం మార్పు చేసింది. గతంలో పాలపిట్ట రంగు చీరలను పంపిణీ చేయగా.. ఈ ఏడాది ఎరుపు రంగు జరీ అంచుతో కూడిన చిలకపచ్చ రంగు చీరలను ఎంపిక చేసింది. చేనేత, వస్త్ర పరిశ్రమకు ప్రాధాన్యం కల్పించడంతో పాటు మహిళలకు నాణ్యమైన చీరలు అందించాలనే ఉద్దేశంతో ఏప్రిల్ నుంచే ఉత్పత్తి ప్రక్రియను ప్రారంభించారు. సిరిసిల్లతో పాటు రాష్ట్రంలోని మరో 13 కేంద్రాల్లో చీరల తయారీ చేపట్టారు. మొత్తం 95 లక్షల చీరలు సిద్ధం చేయాల్సి ఉండగా.. ఇప్పటివరకు సుమారు 65 లక్షల చీరల ఉత్పత్తి పూర్తయింది. వీటిని ఇప్పటికే వివిధ జిల్లాలకు తరలించారు. దాదాపు రెండు నెలల క్రితమే సగానికి పైగా చీరలు సిద్ధమైనప్పటికీ, దివంగత ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని నవంబరు 19న పంపిణీ ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రతిపాదనకు గురువారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం ఆమోదం తెలిపింది.

చీరల పంపిణీలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించింది. తెల్ల రేషన్‌కార్డులు కలిగిన కుటుంబాలకు చెందిన మహిళలకు వారం రోజుల పాటు చీరలను పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాల్లో లేదా నిర్దేశిత ప్రాంతాల్లో మహిళలు తమ ఆధార్ కార్డులను సంబంధిత పంచాయతీ అధికారులకు చూపించాల్సి ఉంటుంది. అధికారులు యాప్ ద్వారా లబ్ధిదారుల ఫొటోలను తీసి, ఆధార్ తదితర వివరాలను ధ్రువీకరించిన అనంతరం చీరలను అందజేస్తారు. ఒకే లబ్ధిదారుకు రెండుసార్లు చీరలు అందకుండా.. అర్హులైన ప్రతి మహిళకు ప్రయోజనం చేకూరేలా ఈ డిజిటల్ విధానాన్ని అమలు చేయనున్నారు. పంపిణీ బాధ్యతలను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బందితో పాటు సెర్ప్ ఉద్యోగులకు ప్రభుత్వం అప్పగించింది. 95 లక్షల మంది మహిళలకు నిర్ణీత గడువులోగా చీరలు చేరేలా జిల్లాల వారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

పాకాల సరస్సులో తీవ్ర విషాదం.. ఇద్దరు చిన్నారులతో కలిసి తల్లి మృతి!



న్యూస్ డెస్క్, 07 నవంబర్ (తెలుగు గళం): వరంగల్ జిల్లాలోని పాకాల సరస్సులో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ తల్లి తన ఇద్దరు చిన్నారులతో కలిసి సరస్సులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళితే గీసుకొండ మండలం ఎలుకుర్తి హవేలీ గ్రామానికి చెందిన మమత అదే గ్రామానికి చెందిన ఈరెల్లి సుమన్‌ను కులాంతర వివాహం చేసుకున్నట్లు సమాచారం. వీరికి ఇద్దరు ఆడపిల్లలు జన్మించారు. అయితే కొంతకాలంగా భర్త సుమన్ మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో వారం రోజుల క్రితం గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా నిర్వహించినట్లు తెలిసింది.

అయినప్పటికీ కుటుంబ కలహాలు సద్దుమణగక పోవడంతో మనస్తాపానికి గురైన మమత తన ఇద్దరు పిల్లలతో కలిసి శనివారం ఉదయం పాకాల సరస్సుకు చేరుకుంది. టికెట్ తీసుకుని బోటింగ్ వైపుగా వెళ్ళారు. అక్కడే ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక సమాచారం. కాగా మమత స్వగ్రామమైన ఎలుకుర్తి హవేలీ నుంచి పాకాల సరస్సు సుమారు 35 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆమె అక్కడికి ఎప్పుడు, ఎలా చేరుకుంది..? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. సమాచారం అందుకున్న ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, దుగ్గొండి సీఐ శంకరయ్య, ఖానాపురం ఎస్ఐ రామ్మోహన్ సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పేద చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన దీపావళి

- 30 మంది నిరుపేద చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు పూయించిన జ్వాలా ట్రస్ట్
- సేవా వెలుగులతో చిన్నారుల ఇళ్లలో దీపావళి సంబరాలు





తెలుగు గళం మంగపేట, నవంబర్ 07:

పండుగ వేడుకలు ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని, ముఖ్యంగా నిరుపేద చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు వికసించినప్పుడే దీపావళి పండుగకు నిజమైన సార్థకత చేకూరుతుందని మంగపేట ఎస్సై మధుకర్ అన్నారు. జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లి“ఒక చిన్నారి -- ఒక చిరునవ్వు -- ఒక వెలుగు”లి అనే నినాదంతో నిర్వహించిన సేవా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పండుగ జరుపుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 30 మంది నిరుపేద చిన్నారులను గుర్తించి, వారికి మిఠాయిలు, పండ్లు, కాకరపువ్వొత్తులతో కూడిన దీపావళి కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మధుకర్ మాట్లాడుతూ.. నిరుపేద చిన్నారులకు పండుగ ఆనందాన్ని పంచేందుకు జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ చేపట్టిన సేవా కార్యక్రమం అభినందనీయమన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా పేదలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ట్రస్ట్ చేపట్టే సేవా కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్ మాట్లాడుతూ.. ప్రతి చిన్నారి ఆనందంగా దీపావళి జరుపుకోవాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పండుగ సందర్భంగా బాణాసంచా కాల్చేటప్పుడు చిన్నారులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షులు గంగుల చంటి, వీరన్, కార్యదర్శి భాస్కర్, ప్రచార కార్యదర్శి మహమ్మద్ ఖాజా, సామాజిక మాధ్యమాల ఇన్‌ఛార్జ్ శ్రావణ్, ప్రతినిధులు ఎడ్లపల్లి సాయి, నిమ్మల నరేష్, మావిళ్ల నాగరాజు, భూక్యా రవి, గోలి విద్యాసాగర్, సాధనపల్లి సాంబశివరావు, కర్రె లక్ష్మణ్, తోగరు సురేష్, బూర సాయి, బూర గణేష్, ఉడుగుల మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కుల ఉద్యమంలో తుర్స చంటి దొరకు కీలక బాధ్యతలు

- తుడుందెబ్బ ములుగు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియామకం
- ఆదివాసీ హక్కుల పరిరక్షణకు మరింత అంకితభావంతో పనిచేస్తా: చంటి దొర





తెలుగు గళం ములుగు, నవంబర్ 07:

ఆదివాసీ హక్కుల సాధన, చట్టాల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న తుర్స చంటి దొరకు తుడుందెబ్బలో కీలక బాధ్యతలు అప్పగించారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ములుగు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆయన నియమితులయ్యారు. నవంబర్ 6న ములుగు జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా సన్నాహక సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ ఈ నియామకాన్ని ప్రకటించారు. గ్రామస్థాయి కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించి, వెంకటాపురం మండల అధ్యక్షుడిగా పనిచేసిన చంటి దొర గత రెండేళ్లుగా ఆదివాసీ హక్కుల ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఆయన సేవలను గుర్తించి జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా డిసెంబర్ 9న హైదరాబాద్‌లో లక్ష విల్లంబులతో నిర్వహించనున్న ఆదివాసీ బహిరంగ సభను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం చలో హైదరాబాద్ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. తన నియామకంపై తుర్స చంటి దొర మాట్లాడుతూ, రాష్ట్ర అధ్యక్షుడు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తానని, కొమరం భీమ్ పోరాట స్ఫూర్తితో ఆదివాసీ హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం నిర్భయంగా పోరాడుతూ తుడుందెబ్బ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు. ఆయన నియామకంపై ఆదివాసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి..

పిల్లల బంగారు భవిష్యత్తును కాపాడాలి

- డ్రగ్స్, గంజాయి వంటి చెడు వ్యసనాలకు యువత ఆకర్షితులు కావద్దు:--పేరూరు ఎస్సై అశోక్





తెలుగు గళం వాజేడు, నవంబర్ 07:

ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు అయ్యవారిపేటలో కాపేడు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పేరూరు ఎస్సై అశోక్ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. చెడు వ్యసనాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని విద్యలో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ములుగు జిల్లా కార్యదర్శి టి.ఎల్. రవి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాల బారిన పడకుండా విద్యార్థి దశ నుంచే అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మత్తు పదార్థాల విక్రయం, వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం, పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాజేడు మండల కోఆర్డినేటర్ గొంది కామేశ్వరరావు, స్వరూప, రమాదేవి, దీప, భాస్కర్, ప్రసాద్‌తో పాటు సుమారు 70 మంది మహిళలు పాల్గొన్నారు.

ములుగు జిల్లా అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణపై మంత్రి సీతక్క ప్రత్యేక చర్చలు

- అటవీ, పర్యావరణ శాఖ అంశాలపై స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్‌తో సమీక్ష
- జయేష్ రంజన్‌కు మంత్రి సీతక్క ఘన సత్కారం.. సమ్మక్క--సారలమ్మ జ్ఞాపిక అందజేత



తెలుగు గళం ములుగు, నవంబర్ 07:

తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క, పర్యావరణం, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఐఏఎస్ తొలిసారిగా ములుగు జిల్లా పర్యటనకు విచ్చేసిన సందర్భంగా శనివారం ములుగు నూతన కలెక్టరేట్‌లో ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సమ్మక్క--సారలమ్మ దేవతల జ్ఞాపికను బహూకరించారు. అనంతరం ములుగు జిల్లాలో అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, అటవీ శాఖకు సంబంధించిన పలు కీలక అంశాలపై మంత్రి సీతక్క ఆయనతో చర్చించారు. జిల్లా అభివృద్ధితో పాటు ప్రకృతి వనరుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ఐఏఎస్, జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేఖన్, డీఎఫ్ఓ వికాస్ మీనా ఐఎఫ్ఎస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- బుచ్చంపేటలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం: మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు





తెలుగు గళం మంగపేట, నవంబర్ 07:

తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందని మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనలతో మంగపేట మండలంలోని బుచ్చంపేట గ్రామంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అనేక ప్రజాప్రయోజన కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రంలోని పేద ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేయడం ద్వారా ఆహార భద్రతకు భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు రేషన్ సేవలు మరింత సులభతరం కానున్నాయని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కాంగ్రెస్ నాయకులు కృషి చేస్తారని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అయ్యోరి యానయ్య, జిల్లా నాయకులు మాసిరెడ్డి వెంకటరెడ్డి, ఏటూరునాగారం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జంగం భానుచందర్, నాయకులు గడ్డం శ్రీహరి, పల్లె శోభన్, పన్నాల కొండల్ రెడ్డి, గడ్డం పరమేశ్, రాచకొండ సోమయ్య, రేషన్ డీలర్ కవిత, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పాలన రద్దు చేసి గవర్నర్ పాలన చేపట్టాలి!

- నాలుగు గోడలకే పరిమితమైన ఆదివాసీ చట్టాలు!
- ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో స్వయంపాలన కల్పించాలి!
- గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర డిమాండ్

తెలుగు గళం వెంకటాపురం (నూగూరు), నవంబర్ 7:

ఆదివాసీ హక్కులను, రాజ్యాంగబద్ధమైన చట్టాలను పరిరక్షించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర తీవ్రంగా విమర్శించారు. శనివారం వెంకటాపురం మండలం నూగూరు కాలనీలో మడకం రవి అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో 1/70 భూబదలాయింపు నియంత్రణ చట్టం, పెసా, అటవీ హక్కుల చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ చట్టాల పరిరక్షణలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. జీవో నంబర్ 3 రద్దు విషయంలో ఆదివాసీల ప్రయోజనాలను కాపాడడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని మండిపడ్డారు. ఆదివాసీ చట్టాల పరిరక్షణ కోసం సుప్రీంకోర్టులో న్యాయపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఆదివాసీల హక్కులను కాపాడలేని ముఖ్యమంత్రి పాలనను రద్దు చేసి గవర్నర్ పాలన కొనసాగించాలని, ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీలకు స్వయంపాలన కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మడకం సురేష్, రామారావు, కృష్ణ, సుజాత, పార్వతి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్కపెల్లిగూడెంలో ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభల విజయవంతానికి మాస్ క్యాంపెయిన్

మహాసభల నిర్వహణకు నిధుల సేకరణ.. రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి: భూక్యా చందు నాయక్



స్టేషన్ ఘనపూర్ నవంబర్ 07 (తెలుగు గళం)

అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ స్టేషన్ ఘన్పూర్ మండలం అక్కపెల్లిగూడెం గ్రామంలో శనివారం మాస్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభల నిర్వహణకు ఆర్థిక సహకారం అందించాలని కోరుతూ నిధుల సేకరణ చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రైతు సంఘం జనగామ జిల్లా కార్యదర్శి భూక్యా చందు నాయక్ మాట్లాడుతూ, నవంబర్ 15, 16, 17, 18 తేదీల్లో నల్లగొండలో నిర్వహించనున్న ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభలు దేశ రైతాంగానికి దిశానిర్దేశం చేయనున్నాయని అన్నారు. దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, కనీస మద్దతు ధరల చట్టం, రైతుల రుణ విమోచన, ప్రభుత్వ రంగంలో పంటల కొనుగోలు, వ్యవసాయ రంగంపై కార్పొరేట్ సంస్థల దాడులు వంటి కీలక అంశాలపై మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు.జాతీయ మహాసభలను విజయవంతం చేయడానికి ప్రతి గ్రామం నుంచి రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మహాసభల నిర్వహణకు ప్రతి ఒక్కరూ తమ వంతు ఆర్థిక సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్, పార్టీ మండల కమిటీ సభ్యులు యారా మోహన్, తోడంగల ఐలయ్య, ఇప్పగూడెం ఉపసర్పంచ్ లింగనబోయిన రాజు, రైతు సంఘం మండల కార్యదర్శి లింగనబోయిన కుమార్, జిల్లా కమిటీ సభ్యులు మంద మొగిలి, నాయకులు అనుముల ఎల్లయ్య, లింగనబోయిన శ్రీకాంత్, తోడంగల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



దీపాలు వెలిగిద్దాం... చీకట్లను తరిమేద్దాం!

చీకటిపై వెలుగు విజయం...
చెడుపై మంచి గెలుపు...
ఆనందాల వెలుగుల పండుగ
దీపావళి!

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగల్లో దీపావళికి ప్రత్యేక స్థానం ఉంది.చీకటిని పారద్రోలుతూ ప్రతి ఇంటా వెలుగులు నింపే ఈ పర్వదినం మనకు ఎన్నో గొప్ప జీవిత సత్యాలను బోధిస్తుంది. చెడుపై మంచి సాధించిన విజయానికి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి, నిరాశపై ఆశ గెలిచిన విజయానికి దీపావళి ప్రతీకగా నిలుస్తుంది. అందుకే దీపావళిని వెలుగుల పండుగగా అభివర్ణిస్తారు.మన సంప్రదాయంలో దీపానికి ఎంతో విశిష్టమైన స్థానం ఉంది.ప్రతిరోజూ పూజా కార్యక్రమాల్లో దీపం వెలిగించడం పవిత్రమైన ఆచారం. దీపం జ్ఞానానికి, పవిత్రతకు, శుభానికి ప్రతీకగా భావిస్తారు.కార్తీక మాస అమావాస్య రోజున జరుపుకునే దీపావళి పర్వదినాన ప్రజలు తమ ఇళ్లలో దీపాలు వెలిగించి లక్ష్మీదేవిని పూజిస్తారు.ఇళ్లను విద్యుత్ దీపాలతో అలంకరించి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటారు.దీపావళి పండుగకు అనేక పురాణగాథలు, ఆధ్యాత్మిక విశేషాలు ముడిపడి ఉన్నాయి.రామాయణం ప్రకారం, రావణుడిపై విజయం సాధించిన అనంతరం శ్రీరాముడు సీతాదేవి, లక్ష్మణుడితో కలిసి అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రజలు దీపాలు వెలిగించి స్వాగతం పలికారని చెబుతారు. మరోవైపు శ్రీకృష్ణుడు నరకాసురుడిని సంహరించిన విజయానికి గుర్తుగా కూడా దీపావళిని జరుపుకుంటారు. ఈ కథలన్నీ చెడుపై మంచి సాధించే విజయాన్ని చాటిచెబుతాయి.లక్ష్మీదేవి పూజకు కూడా దీపావళి రోజున విశేష ప్రాధాన్యత ఉంది.సంపద, సౌభాగ్యం, శ్రేయస్సుకు ప్రతీకగా భావించే లక్ష్మీదేవిని భక్తిశ్రద్ధలతో పూజిస్తారు.వ్యాపారులు ఈ పర్వదినాన్ని నూతన ఆర్థిక సంవత్సరానికి ప్రారంభంగా భావించి కొత్త ఖాతా పుస్తకాలను ప్రారంభిస్తారు. కొన్ని ప్రాంతాల్లో ఐదు రోజుల పాటు దీపావళి వేడుకలు నిర్వహిస్తారు.భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో భిన్నమైన ఆచారాలు, సంప్రదాయాలతో ఈ పండుగను జరుపుకుంటారు.దీపావళి సందర్భంగా కుటుంబ సభ్యులందరూ తెల్లవారుజామున తలంటు స్నానాలు చేసి కొత్త దుస్తులు ధరిస్తారు.ఇళ్ల ముందు అందమైన రంగవల్లులు తీర్చిదిద్దుతారు.గుమ్మాలకు మామిడాకుల తోరణాలు, బంతిపూల అలంకరణలు చేస్తారు.పిండి వంటలు, మిఠాయిలు తయారుచేసి బంధుమిత్రులకు పంచిపెడతారు.సాయంత్రం వేళ ఇళ్ల ముందు, గడపల వద్ద దీపాలు వెలిగించి లక్ష్మీదేవికి పూజలు నిర్వహిస్తారు. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ కలిసి ఆనందంగా పండుగను జరుపుకుంటారు.దీపావళి అంటే కేవలం దీపాలు వెలిగించడం, బాణసంచా కాల్చడం, మిఠాయిలు పంచుకోవడం మాత్రమే కాదు. మన జీవితాల్లోని అంధకారాన్ని తొలగించి ప్రేమ, స్నేహం, మానవత్వం, సోదరభావం అనే వెలుగులను నింపుకోవడమే ఈ పండుగ అసలైన సందేశం. మన మధ్య ఉన్న అసూయ, ద్వేషం, అహంకారం, విభేదాలను పక్కనపెట్టి పరస్పర ప్రేమాభిమానాలతో జీవించాలని దీపావళి మనకు గుర్తుచేస్తుంది.మనస్పర్థలను మరచి ఒకరినొకరు క్షమించుకోవడానికి, బంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి ఈ పండుగ మంచి సందర్భం.అయితే పండుగ సంబరాల పేరుతో పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించకూడదు.బాణసంచా వినియోగం వల్ల వెలువడే పొగ, శబ్దం గాలి, శబ్ద కాలుష్యానికి కారణమవుతాయి.ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు, పెంపుడు జంతువులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.టపాసులు కాల్చేటప్పుడు తగిన భద్రతా నియమాలు పాటించాలి. పర్యావరణ హితమైన దీపావళిని జరుపుకోవడంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలి.ప్రతి ఇంటి గడపలో వెలిగే దీపం ఒక కొత్త ఆశకు సంకేతం. ప్రతి మనసులో వెలిగే చిరుదీపం ఒక మంచి ఆలోచనకు నాంది. మన జీవితాల్లోని అజ్ఞానం, మూఢనమ్మకాలు, ద్వేషం అనే చీకట్లను తొలగించి జ్ఞానం, విజ్ఞానం, ప్రేమ, మానవత్వం అనే వెలుగులను నింపుకుందాం. పేదవారి జీవితాల్లోనూ ఆనందాల వెలుగులు నింపేందుకు మన వంతు సహకారం అందిద్దాం.

దీపాలు వెలిగిద్దాం... చీకట్లను తరిమేద్దాం... ప్రేమను పంచుదాం... మానవత్వాన్ని చాటుదాం... అందరి జీవితాల్లో ఆనందాల వెలుగులు నింపుదాం!

తెలుగు ప్రజలందరికీ దీపావళి పర్వదిన శుభాకాంక్షలు!

లకావత్ చిరంజీవి
స్టేషన్ ఘనపూర్
సెల్: 99630 40960



దీపావళి పండుగ: చీకటిపై వెలుగు విజయం..

చెడుపై మంచి గెలుపునకు ప్రతీక!



ఆధ్యాత్మికత, ఆనందం,
కుటుంబ అనుబంధాలు,
సంస్కృతి, సంప్రదాయాల
సమ్మేళనం దీపావళి.
అజ్ఞానమనే చీకటిని తొలగించి
జ్ఞానమనే వెలుగును నింపే
పర్వదినం.
పర్యావరణ పరిరక్షణ,
మానవీయ విలువలను
చాటిచెప్పే వెలుగుల పండుగ.

తెలుగు గళం ప్రత్యేక కథనం

భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో దీపావళికి విశిష్టమైన స్థానం ఉంది.దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకునే ఈ పండుగను వెలుగుల పండుగగా పిలుస్తారు.దీపావళి అంటే దీపాల వరుస అని అర్థం. దీపం అంటే వెలుగు, ఆవళి అంటే వరుస. చీకట్లను పారద్రోలుతూ వెలుగులు నింపే ఈ పండుగ కేవలం దీపాలు వెలిగించుకోవడం, టపాసులు కాల్చుకోవడం, కొత్త బట్టలు ధరించడం, మిఠాయిలు పంచుకోవడంతోనే పరిమితం కాదు.మనిషిలోని అజ్ఞానం, అసూయ, ద్వేషం, అహంకారం వంటి చెడు లక్షణాలను తొలగించి ప్రేమ, దయ, ధర్మం, మానవత్వం వంటి సద్గుణాలను అలవర్చుకోవాలనే గొప్ప సందేశాన్ని అందిస్తుంది.దీపావళి పండుగకు సంబంధించి అనేక పురాణ కథనాలు ఉన్నాయి. శ్రీరాముడు 14 సంవత్సరాల వనవాసం అనంతరం రావణుడిని సంహరించి సీతాదేవి, లక్ష్మణుడితో కలిసి అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంగా ప్రజలు దీపాలు వెలిగించి స్వాగతం పలికారని రామాయణ కథనం చెబుతుంది. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దీపావళిని జరుపుకుంటారని విశ్వాసం.అలాగే శ్రీకృష్ణుడు నరకాసురుడిని సంహరించి ప్రజలకు విముక్తి కల్పించిన రోజును నరక చతుర్దశిగా జరుపుకుంటారు.సముద్ర మథనం సందర్భంగా లక్ష్మీదేవి ఆవిర్భవించిందనే పురాణ విశ్వాసంతో దీపావళి రోజున లక్ష్మీదేవిని పూజించి ఐశ్వర్యం, సుఖసంతోషాలు కలగాలని ప్రజలు ప్రార్థిస్తారు.దీపావళి వేడుకలు అనేక ప్రాంతాల్లో ఐదు రోజులపాటు కొనసాగుతాయి. ధన త్రయోదశితో వేడుకలు ప్రారంభమవుతాయి. ఈ రోజున బంగారం, వెండి, కొత్త వస్తువులు కొనుగోలు చేయడం శుభప్రదంగా భావిస్తారు.నరక చతుర్దశి రోజున తెల్లవారుజామున నూనెతో తలంటుకొని స్నానం చేసి కొత్త దుస్తులు ధరిస్తారు.అమావాస్య రోజున ప్రధాన దీపావళి వేడుకలు నిర్వహిస్తారు.ఇళ్లను దీపాలతో అలంకరించి లక్ష్మీదేవి, గణేశుడికి ప్రత్యేక పూజలు చేస్తారు.అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి పండుగను ఆనందంగా జరుపుకుంటారు.గోవర్ధన పూజ, భాయ్ దూజ్ వంటి వేడుకలతో ఈ పండుగ పరంపర కొనసాగుతుంది.దీపావళి ప్రధానంగా హిందువులు జరుపుకునే పండుగ అయినప్పటికీ జైనులు, సిక్కులు, కొన్ని బౌద్ధ సమాజాలు కూడా తమ తమ మతపరమైన, చారిత్రక విశ్వాసాలకు అనుగుణంగా ఈ పర్వదినాన్ని జరుపుకుంటారు.జైనులు మహావీరుడి నిర్వాణ దినంగా గుర్తుచేసుకుంటారు.సిక్కులు గురు హర్‌గోవింద్ సాహిబ్ జైలు నుంచి విడుదలైన సందర్భాన్ని బందీ ఛోర్ దివస్‌గా జరుపుకుంటారు. భిన్న సంప్రదాయాలు ఉన్నప్పటికీ వెలుగు, శాంతి, సత్యం అనే భావనలు అందరిలోనూ కనిపిస్తాయి.దీపావళి సందర్భంగా ఇళ్లను శుభ్రం చేసి రంగవల్లులతో అలంకరిస్తారు.గుమ్మాలకు పూలతోరణాలు కడతారు. సాయంత్రం మట్టి ప్రమిదల్లో నూనె లేదా నెయ్యి పోసి దీపాలు వెలిగిస్తారు.కుటుంబ సభ్యులంతా కలిసి పూజలు నిర్వహిస్తారు.బంధువులు, స్నేహితులకు మిఠాయిలు పంచుతూ శుభాకాంక్షలు తెలుపుకుంటారు.పేదలకు దుస్తులు, ఆహార పదార్థాలు అందిస్తూ దానధర్మాలు చేయడం కూడా ఈ పండుగలో భాగంగా కొనసాగుతోంది.దీపావళి పండుగ దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంది.ఈ సందర్భంగా బంగారం, వెండి, దుస్తులు, గృహోపకరణాలు, మిఠాయిలు, అలంకరణ వస్తువుల కొనుగోళ్లు పెరుగుతాయి. చిన్న వ్యాపారులు, కుమ్మరులు, స్వర్ణకారులు, పూల వ్యాపారులు, చేతివృత్తుల వారికి ఉపాధి లభిస్తుంది.ముఖ్యంగా మట్టి ప్రమిదలు తయారు చేసే కుమ్మరి కుటుంబాలకు ఈ పండుగ ఆర్థికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.అయితే ఆధునిక కాలంలో టపాసుల వినియోగం పెరగడం వల్ల వాయు, శబ్ద కాలుష్యం సమస్యలు తలెత్తుతున్నాయి.టపాసుల పొగ చిన్నపిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారికి ఇబ్బందులు కలిగిస్తుంది.పక్షులు, పెంపుడు జంతువులు కూడా భారీ శబ్దాలకు భయపడతాయి.నిర్లక్ష్యంగా టపాసులు కాల్చడం వల్ల అగ్నిప్రమాదాలు, గాయాలు సంభవించే ప్రమాదం ఉంది.అందువల్ల టపాసులు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలి.పిల్లలు పెద్దల పర్యవేక్షణలోనే వేడుకల్లో పాల్గొనాలి. మట్టి ప్రమిదలకు ప్రాధాన్యతనిస్తూ టపాసుల వినియోగాన్ని తగ్గించాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.పండుగ అంటే కేవలం మన కుటుంబం సంతోషంగా ఉండటం మాత్రమే కాదు.సమాజంలోని నిరుపేదలు, అనాథలు, వృద్ధులు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారిని గుర్తుచేసుకొని చేతనైన సహాయం చేయడం కూడా. మన ఇంట్లో దీపాలు వెలిగించే సమయంలో మరో పేద కుటుంబంలోనూ ఆనందం నింపగలిగితే అదే నిజమైన దీపావళి అవుతుంది.మారుతున్న కాలానికి అనుగుణంగా పండుగలు జరుపుకునే విధానంలో మార్పులు వచ్చినా వాటి వెనుక ఉన్న అసలు సందేశాన్ని మరిచిపోకూడదు.ఆడంబరాలకు, అనవసర ఖర్చులకు దూరంగా ఉంటూ కుటుంబ అనుబంధాలు, మానవీయ విలువలు, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి.దీపావళి మనకు అందించే సందేశం ఒక్కటే.. చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం విజయం సాధించాలి.మనలోని ద్వేషాన్ని తొలగించి ప్రేమను పంచాలి. స్వార్థాన్ని విడిచిపెట్టి సేవా భావాన్ని పెంపొందించుకోవాలి.మన ఇంట్లో వెలిగించే దీపంతోపాటు మరొకరి జీవితంలోనూ ఆశాదీపం వెలిగించినప్పుడే ఈ పండుగకు నిజమైన సార్థకత చేకూరుతుంది.దీపాలు వెలిగిద్దాం..చీకట్లను తరిమేద్దాం..ప్రేమను పంచుదాం..ప్రకృతిని కాపాడుదాం..ప్రతి ఇంటా ఆనందం, ప్రతి మనసులో మానవత్వం వెల్లివిరిసేలా దీపావళిని జరుపుకుందాం.అందరికీ దీపావళి శుభాకాంక్షలు!

(ముహమ్మద్ సలీం ఈ69న్యూస్ - తెలుగు గళం దినపత్రిక స్టేట్ బ్యూరో రిపోర్టర్-9949356387)

షాకింగ్ డెసిషన్ తీసుకున్న షమీ



స్పోర్ట్స్ న్యూస్, 07 నవంబర్ (తెలుగు గళం): భారత సీనియర్ బౌలర్ మహ్మద్ షమీ షాకింగ్ డెసిషన్ తీసుకున్నాడు. టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. దీంతో 13 ఏళ్ల టెస్టు కెరీర్‌కు ముగింపు పలికాడు. సోషల్ మీడియా వేదికగా షమీ తన నిర్ణయాన్ని వెల్లడించాడు. 'నేను తెల్లటి జెర్సీకి వీడ్కోలు పలుకుతున్నా. కానీ, దానితో ముడిపడి ఉన్న జ్ఞాపకాలకు ఎప్పటికీ వీడ్కోలు పలకను. నేను తొలిసారిగా భారత టెస్టు జెర్సీ ధరించినప్పుడు దేశానికి ఏదైనా చేయాలనేదే నా ఏకైక కల. అప్పటి నుంచి ప్రతి వికెట్, ప్రతి కష్టం, ప్రతి గాయం, ప్రతి పునరాగమనం నాకు ఏదోకటి నేర్పించాయి. టెస్టు క్రికెట్ నాకు కేవలం ఒక ఫార్మాట్ మాత్రమే కాదు. నా జీవితంలో ఎంతో ప్రత్యేకమైన భాగం. ఈ రోజు భారమైన హృదయంతో, లెక్కలేనని అద్భుతమైన జ్ఞాపకాలతో టెస్టు క్రికెట్ నుంచి నేను రిటైర్మెంట్ ప్రకటిస్తున్నా.'అని షమీ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఎమోషనల్ పోస్టు పెట్టాడు.

షమీ తాను టెస్టు అరంగేట్రం చేసిన రోజునే సుదీర్ఘ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడం గమనార్హం. షమీ 2013లో భారత్ తరఫున టెస్టు అరంగేట్రం చేశాడు. 2013 నవంబర్ 6న కోల్‌కతాలో వెస్టిండీస్‌తో తన తొలి టెస్టు మ్యాచ్ ఆడాడు. 13 ఏళ్ల తర్వాత మళ్లీ నవంబర్ 6నే టెస్టు క్రికెట్ నుంచి తప్పుకున్నాడు. ఈ 13 ఏళ్ల కెరీర్‌లో ఎన్నో మ్యాచ్‌ల్లో షమీ భారత్‌ను గెలిపించాడు. 64 టెస్టుల్లో 229 వికెట్లు పడగొట్టాడు. ఆరుసార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. షమీ టెస్టుల్లో టీమిండియాకు ప్రాతినిధ్యం వహించి మూడేళ్లు అయిపోయింది. 2023లో ఆస్ట్రేలియాపై చివరి టెస్టు మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత జట్టులో చోటు కోల్పోయాడు. వరుస గాయాలు కూడా అతని పునరాగమనానికి అడ్డుగా మారాయి.

సింధుకు కీలక పదవి.. ఐవోఏ అథ్లెట్ల కమిషన్ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక



స్పోర్ట్స్ న్యూస్, 07 నవంబర్ (తెలుగు గళం): భారత బ్యాడ్మింటన్ స్టార్ క్రీడాకారిణి పీవీ సింధుకు కీలక పదవి దక్కింది. ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్(ఐవోఏ) అథ్లెట్ల కమిషన్ చైర్‌పర్సన్‌గా ఆమె ఎన్నికైంది. భారత పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యాడు. సింధు, హర్మన్‌ప్రీత్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి సంజయ్ కె శ్రీవాస్తవ ప్రకటించారు. దీంతో శనివారం జరగాల్సిన ఎన్నికలను నిర్వహించాల్సిన అవసరం లేదు. చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు వీరిద్దరూ మాత్రమే నామినేషన్స్ దాఖలు చేశారు. దీంతో వీరి ఎన్నిక ఏకగ్రీవమైంది. దీంతో సింధు, హర్మన్‌ప్రీత్ ఐవోఏ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లోనూ సభ్యులుగా చేరనున్నారు. డిసెంబర్ 5న ఐవోఏ ఎన్నికల తర్వాత కార్యవర్గ మండలి ఏర్పాటవుతుంది. మరోవైపు, వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను, స్విమ్మర్ సజన్ ప్రకాశ్ కూడా ఐవోఏ జనరల్ బాడీలో అథ్లెట్ల ప్రతినిధులుగా ఎన్నికయ్యారు. ఈ రెండు పదవులకు కూడా వారిద్దరు మాత్రమే నామినేషన్లు దాఖలు చేయడంతో వారు ఎన్నిక కూడా ఏకగ్రీవమైంది.డిసెంబర్ 5న జరిగే ఐవోఏ ఎన్నికల్లో చాను, సజన్‌లకు ఓటు వేసేందుకు అర్హులు. సింధు, హర్మన్‌తోపాటు చాను, సజన్ పదవీకాలం నాలుగేళ్లు. 2026 నుంచి 2030 వరకు తమ పదవుల్లో కొనసాగుతారు. ఈ నెల 3న ఐవోఏ అథ్లెట్ల కమిషన్ సభ్యులుగా సింధు, హర్మన్‌ప్రీత్ సహా 10 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.